క్లుప్తంగా

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ నేత మృతి


ఎర్రయ్య (ఫైల్)

రొంపిచెర్ల: మండలంలోని చెంచెంరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ ఆర్ బెస్తపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు సూర్య నారాయణ రెడ్డి, విజయశేఖర్, నాగిరెడ్డి, రామనారాయణ రెడ్డి, రవీంద్ర తదితరులు నివాళులు అర్పించారు.

18 నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

పలమనేరు: స్థానిక గుండుబావి ఎదురుగా ఉన్న వాణి మహిళా జూనియర్ కళాశాలలో ఈనెల 18 నుంచి జూన్ 7వ తేదీ వరకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై పినాక ప్రజాసాధికార ట్రస్ట్, యాదగిరి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు వై గజేంద్రగౌడ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదువుతున్న, ఆపై చదువులు చదివిన వారు ఇంటర్వ్యూల్లో ఆంగ్లంపై పట్టు సాధించడానికి, మాట్లాడటానికి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వంద మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తామని, దూరప్రాంతాల వారికి ఉచిత హాస్టల్, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామని, శిక్షణానంతరం స్టడీ మెటీరియల్ కూడా ఇస్తామని తెలియజేశారు.

రైతు సమాచార కేంద్రాల్లో సుఖీభవ జాబితా

శాంతిపురం: అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితాలను అన్ని రైతు సమాచార కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. మండలంలోని 60 రెవెన్యూ గ్రామాలకు గాను 18,050 మంది రైతుల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. వీటిలో అర్హుల పేర్లు మాత్రం రైతులు అప్రూవ్ చేయించుకోవాలని కోరారు. రాజ్యాంగబద్ధమైన స్థాయిల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లు, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారు, భూమి లేని వారి పేర్లను అనర్హులుగా గుర్తిస్తామన్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుకు తప్పని పడిగాపులు


జరుగు సచివాలయంలో ఉద్యోగి చుట్టూ గుమికూడిన జనం

కుప్పం రూరల్: ప్రభుత్వం 7వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులు, కార్డుల్లో ఎడిటింగ్ ఆప్షన్ తీసుకువచ్చినప్పటికీ దీనికనుగుణంగా సర్వర్లు, వసతులను కల్పించలేకపోయింది. దీంతో వినియోగదారులు సచివాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం, మహిళలు, పిల్లలతో వచ్చినవారు నిలువ నీడలేక ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక, సర్వర్లు మొరాయిస్తుండడంతో ఒక్కో ఎంట్రీ నాలుగైదుసార్లు చేయాల్సి వస్తోందని సచివాలయ సిబ్బంది చెప్పారు. ఫలితంగా గంటల తరబడీ జాప్యం అవుతుండడంతో విసిగి వేసారి ప్రజలు వెనుదిరుగుతున్నారు. అధికారులు రేషన్‌కార్డుల వేగవంతానికి సర్వర్లు వేగవంతం చేయాలని, అలాగే సచివాలయ వద్ద తాగునీరు, కుర్చీలు, సచివాలయంలో ఫ్యాన్లు..ఇత్యాది వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

జమీందారుల విగ్రహం ఏర్పాటు చేయాలి

పుంగనూరు: పుంగనూరు కేంద్రంగా పరిపాలన సాగించిన పుంగనూరు జమీందారులు రాజా వీరబసవ చిక్కరాయల్ యశోవంత బహదూర్ విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని శ్రీమన సాయిసదన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు దక్షిణామూర్తి, ప్రకాష్, కృష్ణమూర్తి కోరారు. సోమవారం ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎమ్మెల్యే, ఎంపీలకు, ప్రభుత్వానికి వినతిపత్రం పంపారు. జమీందారులు నియోజకవర్గంతో పాటు రామసముద్రం, పెద్దపంజాణి, గంగవరం మండలాలను సైతం సుమారు 70 ఏళ్లు జమీందారు పాలించారని, ప్రజలకు భూదానం చేశారని, అలాంటి జమీందారుల విగ్రహం పట్టణంలో ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని కోరారు.

శిక్షణతో స్వయం ఉపాధి


కుట్టు శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణ

గుడుపల్లె: శిక్షణతో స్వయం ఉపాధి పొంది మహిళలు కుటుంబానికి చేదోడువాదోడుగా నిలవాలని ఎంపీడీఓ రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 148 మంది మహిళలు ఈ శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిని రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ చెప్పారు. టైలరింగ్ నేర్చుకున్న వారిలో 75 శాతం హాజరు ఉన్న మహిళలకే ఉచితంగా కుట్టుమెషిన్లు ఇస్తామన్నారు. ఒలో నాయకులు టీఎం బాబునాయుడు, ఏపీఎం గ్రీటా, కార్యదర్శి సర్గుణ పాల్గొన్నారు.

ఖరీఫ్..సాగుకు సన్నద్ధం

పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు వేసవి దుక్కులకు అనుకూలంగా మారాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ పర్యాయం జిల్లాకు సంబంధించి సుమారు 40వేల క్వింటాళ్ల విత్తనాల అవసరం ఉంది. కానీ ప్రభుత్వం జిల్లాకు 26 వేల క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. విత్తనాలు త్వరలో ఆయా మండలాలకు చేరుకోనున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

- మొదలైన వేసవి పొలం దున్నకాలు
- పలమనేరు డివిజన్‌కు 12వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- కానీ ఈ మేరకు విత్తనకాయలందేది అనుమానమే
- ఇంకా మండలాలకు చేరని విత్తనాలు, తేలని ధర


వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌కు ఈ పర్యాయం 12వేల క్వింటాళ్ల విత్తనకాయల అవసరమని సమాచారం. కానీ జిల్లాకు కేటాయింపులు తక్కువ కావడంతో ఇక్కడికి విత్తనాలు తక్కువగానే అందుతాయనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వేరుశనగ విత్తన కాయల ధర కదిరి–6 రకం కిలో రూ.93, నారాయణి రూ.95గా ఉంది. అయితే ప్రభుత్వం ఈ దఫా 30 కిలోల వేరుశనగ బస్తా ధర ఎంత నిర్ణయిస్తుంది? దీంట్లో ఎంతమేర సబ్సిడీ అనేది ఇంకా నిర్ణయించలేదని తెలిసింది. మొత్తం మీద ఈనెల 20 నుంచి విత్తనాలందడం..ఆపై విత్తనాలు కావాల్సిన వారు సంబంధించి ఆర్‌బీకేలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలుస్తోంది.

ఈసారైనా వేరుశనగ సాగు పెరిగేనా..?

కొన్నేళ్లుగా ఏటా ఇక్కడ వేరుశనగ పంటసాగు తగ్గుముఖం పడుతోంది. సకాలంలో వర్షాలు రాక, లేదా పంట సాగుచేశాక ఆగస్టులో డ్రై స్పెల్స్ లేదా పంట ఒబ్బిబి వేళ వర్షాలు పడక, లేదా ఎక్కువగా వర్షాల కారణంగా పంట దెబ్బతింటూనే ఉంది. దీంతో పెట్టుబడి దక్కక చాలామంది రైతులు వేరుశనగను సాగుచేయడం తగ్గించారు. డివిజన్‌లో ఖరీఫ్‌కు సంబంధించి వేరుశనగ సాధారణ సాగు 18వేల హెక్టార్లుగా ఉంది. మూడేళ్లుగా ఈ విస్తీర్ణం తగ్గుముఖం పడుతూ గతేడాది కేవలం 12వేల హెక్టార్లకు చేరింది. ఈ పర్యాయం అదునులో వర్షాలు పడుతుండడంతో సాగు పెరిగే అవకాశం ఉన్నట్టు వ్యవసాయశాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.


సేంద్రియ ఎరువులను పొలంలో చల్లుతున్న దృశ్యం

పలమనేరు డివిజన్‌కు సంబంధించిన వివరాలిలా...

మొత్తం మండలాలు	: 7
ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం	: 18వేల హెక్టార్లు
ఈ పర్యాయం కావాల్సిన విత్తనాలు	: 12వేల క్వింటాళ్లు
డివిజన్‌లోని మొత్తం రైతులు	: 61,352

ముందస్తుగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేరా..?

ఇలా ఉండగా వేరుశనగ సాగుచేసే పొలాల్లో ముందుగానే పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయశాఖ రైతులకు 50 శాతం సబ్సిడీతో ఆర్‌బీకేల ద్వారా గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేశారు. ఇందులో భాగంగా జనుము, జీలుగ, పిల్లిపెసర, తదితర విత్తనాలను వేరుశనగ విత్తనకాయలకంటే ముందుగా ఇచ్చేవారు. ఈ పర్యాయం వీటిని ఇంకా పంపిణీకి పూనుకోలేదు. దున్నకాలలోనే ముందుగా భూమిలో వీటిని కలియదున్నితే భూమిలో సత్తువ పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది.

ఈ నెలాఖరులోగా విత్తనాల పంపిణీ

వేరుశనగ విత్తనాలు ఇంకా మండలాల్లోని గోడౌన్లకు రాలేదు. సబ్సిడీ ధర నిర్ణయం కూడా ఇంకా ప్రకటించలేదు. గ్రౌండింగ్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక ఈ నెలాఖరు నుంచి సంబంధిత రైతు సేవా కేంద్రాలల్లో విత్తనాల పంపిణీ చేస్తాం. వర్షాలు ముందుగా కురవడం రైతులు దుక్కులను బాగా కలియదున్ని విత్తనాలేసేందుకు సిద్ధం చేసుకోవాలి.

–సంధ్య, వ్యవసాయ అధికారిణి, పలమనేరు

నోటీస్ బోర్డు

- నేడు భగవద్గీతపై అవగాహన

పలమనేరు: 'భగవద్గీత–ఆధునిక జీవితం' అనే అంశంపై ప్రముఖ రచయిత, యోగా గురువు హైదరాబాద్‌కు చెందిన వాసలి వసంతకుమార్ మంగళవారం స్థానిక బసవన్న గుడి ప్రాంగణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పలమనేరు రచయితల సంఘానికి చెందిన మాధవ్, రంగనాథ్ సోమవారం తెలిపారు. అనంతరం స్థానిక శాఖా గ్రంథాలయంలో సాహిత్యం– సామాజికం అనేఅంశంపై ఆయన ప్రసంగించనున్నట్టు వారు తెలిపారు. సాహితీ అభిమానులు, పట్టణ ప్రజలు హాజరు కావాలని కోరారు.

నృత్యం..మంత్రముగ్ధం


భరత నాట్యం చేస్తున్న కళాకారిణి

పలమనేరు: బేలుపల్లె గ్రామ సమీపంలోని శ్రీకళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం ముద్ర డాన్స్ అకాడమీ కళాకారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అశ్వ వాహనంపై శ్రీవారి విహారం


రథంలో ఊరేగుతున్న స్వామివారు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు సోమవారం ఉదయం రథోత్సవం రమణీయంగా సాగింది. రాత్రి అశ్వ వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులను కటాక్షించారు. భక్తులు టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అంతకు ముందు ఆలయంలో స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తి చేసి నైవేద్యం సమర్పించారు. ఆ తరువాత శ్రీనివాసుడు శ్రీదేవి భూదేవి సమేతంగా మహారథంపై కొలువుదీరి, కోలాటాలు, భజన బృందాలు, మంగళ వాయిద్యాల హోరు నడుమ మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం శ్రీవారు దేవేరి సమేతంగా ఉయ్యాలసేవలో సేదతీరారు. కార్యక్రమంలో కంకణ బట్టార్ నరసింహాచార్యులు, డిప్యూటీ స్పెషల్ గ్రేడ్ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు పాల్గొన్నారు.


అశ్వ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

గంగమ్మకు వీర శైవ లింగాయత్‌ల పూజలు


గంగమ్మ ఆలయంలో చేస్తున్న ప్రత్యేక పూజలు

పలమనేరు: తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా సోమవారం పట్టణంలోని వీర శైవ లింగాయత్, జంగమ కులస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

వీధి లైట్లు ఏర్పాటు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకల వారిపల్లె పంచాయతీలో సోమవారం స్థానిక సర్పంచ్ ఉమాదేవి వీధిలైట్లను ఏర్పాటు చేసారు. అలాగే ఉన్న లైట్లకు మరమ్మతులు చేసి సరిచేశారు.

రథోత్సవం


పట్టణంలో నిర్వహిస్తున్న రథోత్సవం

కుప్పం: పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీ రామలింగేశ్వర దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో సోమవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి మంగళవాయిద్యాలు, బాణసంచా మోత, కోలాటాల నడుమ పట్టణ పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. చాలా ఏళ్ల తరువాత రామలింగేశ్వరస్వామి రథంలో ఊరేగుతుండగా పట్టణ వాసులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి ధూళి ఉత్సవాన్ని నిర్వహించారు.

పేదల బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

- చారాల రేషన్ షాపును తనిఖీ చేసిన అధికారులు
- ప్రతి కార్డుదారునికి సరుకులు అందాలి
- తూకాల్లో అక్రమాలకు పాల్పడితే డీలర్‌షిప్ రద్దు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: పేదలకు ప్రతినెలా ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించినా, తూకాల్లో అక్రమాలకు పాల్పడినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హనుమంతునాయక్ హెచ్చరించారు. రేషన్ షాపుల్లో జరుగుతున్న అక్రమ వ్యాపారం, తూకాల్లో మోసాలపై సాక్షిలో 'వేలిముద్ర పెట్టు.... క్యాష్ పట్టు' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రేషన్‌షాపు 14ను పరిశీలించారు. స్టాకును తనిఖీ చేశారు. తూకాల్లో అక్రమాలకు పాల్పడితే డీలర్‌షిప్‌ను రద్దుచేస్తామని హెచ్చరించారు. కార్డుదారులను రేషన్ షాపు వద్ద కాకుండా డీలర్ ఇంటి వద్దకు రప్పించి తూకం మిషన్‌లో రాళ్లు పెట్టి వేయాల్సిన పనేముందని డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్డుదారులందరికీ బియ్యంతోపాటు చెక్కెర, కందిపప్పు సక్రమంగా సకాలంలో ఇవ్వాలని ఆదేశించారు. తూకాల్లో గానీ, ఇవ్వాల్సిన సరుకుల్లో తేడాలొస్తే కార్డుదారులు ఆయా పంచాయతీల్లోని వీఆర్వోలకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ భారతి, వీఆర్వో శ్రీపతిరెడ్డి పాల్గొన్నారు.


చారాల కురప్పల్లెలో కార్డుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న రెవెన్యూ అధికారులు

'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోండి

రొంపిచెర్ల: అన్నదాత సుఖీభవ పథకానికి సుఖీభవ పోర్టల్‌లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి కోరారు. సోమవారం బొమ్మయ్యగారిపల్లె రైతు సేవా కేంద్రంలో స్కిల్ అఫ్ చిత్తూరు– డిజిటల్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మే నెల 20వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.6000, రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 రైతులకు మూడు విడతలుగా ఇస్తుందన్నారు. రైతులు తమ ఆధార్ నంబరు, పొలం వివరాలు, వెబ్ ల్యాండ్ వివరాలు సక్రమంగా ఉన్నాయో, లేదో నిర్ధారించుకోవాలన్నారు. అలాగే ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అధికారులు మంజుల, సుజాత, వెంకటరమణ నాయక్, సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన రైతులు

డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు

పలమనేరు: గత డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఎస్వీయూ పరిధిలో మంచి ఫలితాలను సాధించినట్టు పట్టణానికి చెందిన శ్రీవాణి, పద్మావతి డిగ్రీ కళాశాల నిర్వాహకులు కృష్ణమూర్తి రెడ్డి సోమవారం తెలిపారు. బీఎస్సీలో పవిత్ర, రేవతి, మౌనిక, చైతన్య 90శాతం మార్కులకంటే ఎక్కువ సాధించారని, బీకాంలో లావణ్య, మాధురి, వర్షిత, నందిని 88శాతం సాధించినట్టు పేర్కొన్నారు. మొత్తం మీద 53మంది డిస్టింక్షన్‌లో, 36మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు.

కమనీయం..కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో భక్తులు

సదుం: మండలంలోని బూరగమంద భూదేవీ శ్రీదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం శ్రీవారు గరుడ వాహనంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరు నడుమ ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు కర్పూర హారతులతో నీరాజనాలు సమర్పించారు. అంతకుముందు ఉదయం తిరుచ్చి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు మునుసామి, వెంకటరమణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి దంపతులు, సర్పంచ్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, టీటీడీ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..!


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

పుంగనూరు: పట్టణ సమీపంలోని బాలాజీకాలనీలో సోమవారం కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత వేదపండితులు ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో కొలువుదీర్చి సుందరంగా అలంకరించి భక్తజన సందడి నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం తంతు ముగించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


కల్యాణోత్సవంలో భక్తులు

శాస్త్రోక్తంగా చండీ హోమం

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో కొలువుదీర్చారు. ఆలయ ఈఓ ఏకాంబరం, ఉభయదారులతో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఈ చండీ హోమ పూజలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పూర్ణాహుతి అనంతరం అధికారులు ఉభయదారులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేయించారు.


చండీహోమం చేస్తున్న వేద పండితులు

అక్రమ నిర్మాణాలను అడ్డుకునేదెవరు..?

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

పెద్దపంజాణి: మండలంలోని ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. మండలంలో బట్టందొడ్డిలోని సర్వే నంబర్ 86–2 లో 5.30 ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది. ఇందులో నూతనంగా గ్రామ సచివాలయాన్ని నిర్మించారు. దీని ఆవరణలో మరో మూడు సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. సచివాలయం పక్కనే విలువైన ఈ భూమిపై గ్రామానికి చెందిన కొందరు అక్రమార్కులు కన్నేశారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమంగా నిర్మాణ పనులకు పూనుకున్నారు., దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అండతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు చెప్పారు.


సచివాలయం పక్కన అక్రమంగా చేస్తున్న నిర్మాణ పనులు

రమణీయం..రథోత్సవం


బ్రహ్మరథాన్ని లాగుతున్న భక్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని పట్నపల్లెలో నిర్వహిస్తున్న శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం రథోత్సవం రమణీయంగా సాగింది. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. చుట్టుపక్కల ప్రాంతాల వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.